

పంద్రాగస్టు వేడుకలకు ముఖ్యఅతిథిగా మంత్రి కొండపల్లి

కలెక్టరేట్: స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ ,ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నారని కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఎగురవేశాక మంత్రి స్వాతంత్ర్య సందేశాన్ని అందిస్తారని, శకటాల ప్రదర్శన, సంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారని, ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.




ప్రకాశం పార్కు వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధమైన అన్న క్యాంటీన్, (ఇన్‌సెట్)లో లోపలి భాగం

అన్న క్యాంటీన్లు సిద్ధం

● రేపు విజయనగరంలో రెండు చోట్ల ప్రారంభం ● జాబితాను ప్రకటించిన ప్రభుత్వం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు పునః ప్రారంభానికి సిద్ధమయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని కూటమి ప్రభుత్వం గురువారం వాటిని రాష్ట్ర వ్యాప్తంగా తెరవాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తిచేసింది. దీనిలో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో రెండుచోట్ల అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులు వాటిని సిద్ధం చేశారు. ప్రకాశం పార్కు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ప్రారంభం అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 100 క్యాంటీన్లను తెరవాలని ప్రభుత్వం నిర్ణయించగా జిల్లాలో 3 క్యాంటీన్లు ఏర్పాటుచేయదలచారు. మొదటి దశలో విజయనగరం కార్పొరేషన్‌లో రెండు క్యాంటీన్లను ప్రారంభిస్తు న్నారు. రెండో విడతలో బొబ్బిలిలో ఒకటి ప్రారంభించనున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు క్యాంటీన్ల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొను న్నారు. కాగా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తుండడంతో చిరు వ్యాపారులు, రిక్షా కార్మికులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు, బాటసారులు, పేదలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్యాంటీన్లలో రూ.5కే భోజనం అందించనున్నారు. గతంలో ఆహారం సరఫరా చేసిన అక్షయపాత్ర ఫౌండేషన్‌కే ఈసారి కూడా బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆహారం అందించేందుకు జారీ చేసే టోకెన్లను ఈనెల 16న ఉదయం 7 గంటల నుంచి ఇస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు.

ఏఎంసీలు ఏం చేస్తున్నట్లు?



● వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాల్లా మారిన వైనం
● కానరాని రైతు అనుబంధ సేవలు
● ఆదాయమంతా రాష్ట్ర ఖజానానికే

వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. లక్ష్యానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని రైతు అనుబంధ సేవలకు కేటాయించాలి. స్థానిక సంస్థల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఇవేవీ చేయడం లేదు. గత ఐదేళ్లూ ప్రభుత్వం వీటిని కనీసం పట్టించుకోలేదు. పర్యవేక్షణా లేదు. పైగా వచ్చిన ఆదాయాన్ని మాత్రం తీసుకుంది. దీంతో ఏఎంసీలు పేరుకే ఉన్నాయి.

-విజయనగరం (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రాజాం, బొబ్బిలి, కొత్తవలస, విజయనగరం, గజపతినగరం, పూసపాటిరేగ, చీపురుపల్లి, మెరకముడిదాంలో మార్కెట్ కమిటీ కార్యాలయాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.12.29 కోట్ల ఆదాయం సమకూరినట్టు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. రూ.10 కోట్ల లక్ష్యానికిగాను రూ.2 కోట్లకు పైగా అదనపు ఆదాయం వచ్చినట్టు చెబుతున్నారు. అయితే వ్యవసాయ అనుబంధ రంగాల సేవల గురించి ప్రస్తావిస్తే మాత్రం మౌనమే సమాధానమవుతోంది. వచ్చిన ఆదాయమంతా గత ప్రభుత్వం లాక్కోవడమే కారణం అంటున్నారు. సాధారణంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చెక్‌పోస్టులు, గోదాముల నిర్వహణ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సమయంలో సెస్ వసూలు ద్వారా ఆదాయం సమకూరుతోంది. జిల్లాలో 15 చెక్‌పోస్టులు ఉన్నాయి. ప్రధానంగా ధాన్యం కొనుగోలు సమయంలో అత్యధిక ఆదాయం సమకూరుతోంది. గోదాముల అద్దెరూపంలోనూ ఆదాయం వస్తోంది. కానీ ధాన్యం విక్రయాలు, బియ్యం నిల్వలకు సంబంధించి కోట్లాది రూపాయలు పౌరసరఫరాల సంస్థ నుంచి రావాల్సి ఉంది. వైసీపీ అధికారం లోకి వచ్చిన తరువాత కేవలం ఏఎంసీ లను ఆదాయ వనరులుగా మాత్రమే చూశారు. గత ప్రభుత్వాలు అందించిన సేవలను మరుగున పరిచారు. వీటి నుంచి 2021-22లో రూ.7 కోట్ల ఆదా యం రాగా.. 2022-23 సంవత్సరంలో రూ.12 కోట్లు సమకూరాయి. అయితే ఆదాయం నేరుగా రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోతోంది. స్థానిక సంస్థల వాటాలను చెల్లించడం లేదు. అటు రైతులకు సంబంధించి పశువైద్య శిబిరాలు, సీజన్ల వారీగా పశువులకు టీకాలు, మందులు వేయడం లేదు.

నిధుల కేటాయింపేదీ?

సాధారణంగా నియోజకవర్గానికి ఒకటి, రెండు వరకూ మార్కెట్ కమిటీ కార్యాలయాలుంటాయి. ఆయా ఏఎంసీల పరిధిలో ఉండే మండలాలకు ఆదాయంలో కొంత మొత్తం కేటాయించాలి. వెనుకబడిన గ్రామాలు, పూర్తి వ్యవసాయ ఆధారిత పంచాయతీలకు ఏఎంసీ వాటా నిధులు కేటాయించాలి. గతంలో గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువలు, ఇతరత్రా మౌలిక వసతుల కోసం ఈ నిధులు కేటాయించేవారు. స్థానిక సంస్థల ప్రతినిధులు సైతం ఎంతగానో ఆశగా ఎదురుచూసేవారు. ఇప్పుడు ఏఎంసీల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు వెళ్లిపోతుండగా తిరిగి రావడం లేదు. ఆర్థిక సంఘం, సాధారణ నిధులనూ గత ప్రభుత్వం మళ్లించింది.

ఎమ్మెల్సీగా ఎందుకెళ్తున్నట్టో

● మొన్నటి వరకు ప్రజాధనం లూటీ చేశారు: టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు




టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్, ఆగస్టు 13: జిల్లాలో ప్రజాధనం లూటీ చేసి.. ఎవరిని ఉద్ధరించడానికి ఇప్పుడు ఎమ్మెల్సీగా వెళ్తున్నారో? ప్రజలకు అర్థం కావడం లేదని టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు పరోక్షంగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి విమర్శించారు. టీడీపీ విజయనగరం విస్తృతస్థాయి సమావేశం మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం, ఆ మంత్రివర్గ సహచరులు ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు అచ్చమైన బూతులు మాట్లాడారని అన్నారు. రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ గత ఐదేళ్ల కాలంలో నాశనమయ్యాయన్నారు. స్థానిక సంస్థలు వైసీపీ కబంధ హస్తాల్లో ఉన్నాయని, వాటిని కూడా ఆ పార్టీ నుంచి విముక్తి చేయాలన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

విజయనగరంలో గత పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా సోలార్ యూనిట్ మూలకు చేరిందన్నారు. రానున్న కాలమంతా కీలకమని, ప్రజాపయోగ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ముందుకు సాగాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రెండు నెలలు కాలంలోనే ఎన్నో బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీ మోహన్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ సీనియర్ నేత, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొంగలి పోతన్న మంగళవారం అశోక్‌గజపతి రాజు సమక్షంలో టీడీపీలో చేరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. అశోక్ గజపతిరాజు ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందన్న నమ్మకం ఉందని, ఆ విశ్వాసంతోనే తాను వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరానన్నారు.

ఆకాశం.. కుంకుమ వర్ణశోభితం



బొబ్బిలి ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఆకాశం కనువిందు చేసింది. వర్షం కురిశాక ఆకాశమంతా ఒక్కసారిగా రంగు మారి ఆకట్టుకుంది. కొద్ది నిమిషాలు అలాగే కనిపించడంతో చాలా మంది ఫోన్లలో ఆ దృశ్యాలను బంధించారు.

- బొబ్బిలి



పైడితల్లి ఆలయానికి శ్రావణ శోభ

విజయనగరం రూరల్, ఆగస్టు 13: శ్రావణమాసం పురస్కరించుకుని పైడిమాంబ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రెండో మంగళవారం నేపథ్యంలో మూడులాంతర్ల వద్దనున్న చదురుగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించారు. రైల్వేస్టేషన్ వద్ద వున్న వనంగుడిలో కూడా పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం, పాత బస్టాండ్ వద్ద దుర్గాదేవి ఆలయం, మయూరి కూడలి వద్ద వున్న సంతోషిమాత ఆలయం, రింగురోడ్డులో వున్న జ్ఞానసరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





పాడి పరిశ్రమను అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కీలకమైన గోకులాలు, మినీ గోకులాల పథకాన్ని పునరుద్ధరిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం పాడి రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గోకులాల వైపే చూడలేదు. ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వం జిల్లాకు 700 గోకులాలు మంజూరు చేసింది. ఆ లెక్కన మండలానికి 25 చొప్పున ఏర్పాటుకానున్నాయి.

గోకులాలు వస్తున్నాయ్

● పాడి పరిశ్రమకు ప్రభుత్వం చేయూత
● జిల్లాకు 700 యూనిట్లు మంజూరు

(కలెక్టరేట్)

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం గోకులాలు, మినీ గోకులాలను మొదటిసారిగా తెరపైకి తీసుకొచ్చింది. వాటితో పాడి రైతుల వద్ద ఉన్న పశువులకు, ఇతర జీవాలకు ఆశ్రయం కల్పించింది. జిల్లాలో వేలాది గోకులాలు మంజూరు చేసింది. 2018-19 చివర్లో మంజూరైన వాటిని నిర్మించుకున్న రైతులకు ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా మొండి చేయి చూపించింది. దీంతో పెట్టుబడులు పెట్టి గోకులాలు నిర్మించుకున్న వేలాది మంది రైతులు నష్టపోయారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే రైతులు, పశుపోషకులపై దృష్టి సారించింది. గతంలో అమలు చేసిన గోకులాలు, మినీ గోకులాల నిర్మాణ పథకాన్ని పునరుద్ధరించింది.

వివిధ రకాలుగా గోకులాలు

గోకులాల పథకంలో పాడి ఆవులకు మూడు రకాలుగా... గొర్రెలు, మేకలు, కోళ్లకు రెండు రకాలుగా షెడ్లు నిర్మించుకునే వెసులుబాటు కల్పించారు. రెండు ఆవులకు సరిపడా షెడ్డు విలువ రూ.1,15,000, ఇందులో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1,03,500 సబ్సిడీగా అందుతుంది. రైతులు రూ.11,500(పది శాతం) పెట్టుబడి పెట్టాలి. అదేవిధంగా నాలుగు ఆవుల కోసం రూ.1,85,000, ఆరు ఆవుల కోసం రూ.2,30,000 మంజూరు చేయనున్నారు. ఇందులో కూడా 90 శాతం సబ్సిడీ పోను 10 శాతం రైతులు భరించాల్సి ఉంటుంది. ఇక 20 గొర్రెలు, మేకల కోసం రూ.1,30,000, 50 ఉంటే రూ.2,30,000 ఖర్చువుతుంది. ఇందులో రైతులు 30 శాతం వాటా భరించాల్సి ఉంటుంది. అదే విధంగా కోళ్లకు షెడ్లు నిర్మించుకునేందుకు వంద కోళ్లకు రూ.87,000 ఖర్చులో రూ.26,100 రైతు వాటాగా నిర్ణయించారు. అదే విధంగా 200 కోళ్లకు సరిపడా షెడ్డుకు మొత్తం రూ.1,32,00 కాగా రైతులు రూ.39,600భరించాల్సి ఉంటుంది. వీటిన్నింటినీ రైతులే స్వయంగా నిర్మించుకుంటే ఖర్చు ఆదా అవుతుంది. అవసరమైన వారు సచివాలయ పశు సహాయకులను గానీ, పశువైద్యులను గానీ సంప్రదించవచ్చు. సన్నచిన్న కారు రైతులంతా అర్హులే. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు మంజూరైన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులు సంబంధిత గ్రామ సచివాలయాలకు వెళ్లి వెటర్నరీ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లాకు 700 గోకులాలు

జిల్లాకు 700 గోకులాలు ప్రభుత్వం మంజూరు చేసింది. మండలానికి 25 చొప్పున కేటాయించారు. గ్రామాల్లో అర్హులైన రైతులు ఈ గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదే విషయాన్ని జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ వైవీ రమణ వద్ద ప్రస్తావించగా గోకులాలకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

ఉపాధి కూలీలకు ఊరట

● వారి వేతన బకాయిలు రూ.1.15 కోట్లు విడుదల ● వ్యక్తిగత ఖాతాల్లో జమ

మెంటాడ, ఆగస్టు 13: ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది ఉపాధి హామీ పథకం కూలీలకు గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన సుమారు రూ.1.15 కోట్ల రూపాయల వేతన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మంగళవారం కూలీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో వారు అనందం వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు ఉపాధి పనులు చేపట్టిన అప్పటి ప్రభుత్వం కూలీలకు చెల్లింపుల విషయంలో మీనమేషాలు లెక్కించింది. ఒక్కొక్కరికీ ఐదారు వారాలకు సంబంధించి ఆరేడువేల రూపాయలు చొప్పున చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వారు చాలా ఇబ్బందులు పడ్డారు. ఏరోజుకారోజు ఎదురుచూస్తూ నిరాశకు గురయ్యారు. ఈ వేతన వెతలపై గతనెల 25న 'వేతనాలో రామచంద్రా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లిన క్రమంలో ఆయన జిల్లాలవారీగా వేతన బకాయిల వివరాల కోసం ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు చెల్లింపులు నిలిచిపోయినట్టు తేలింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కూలీల బకాయిలు రూ.1.15 కోట్లు ఉన్నట్టు జిల్లా అధికారులు నివేదిక అందజేసిన క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు కూలీలు వేతన బకాయిలు విడుదల చేశారు. కూలీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ఇవి జమయ్యాయి. ఇదే విషయాన్ని డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి వద్ద ప్రస్తావించగా ఉపాధి వేతన బకాయిల నిధులు విడుదల అయ్యాయని, రెండు రోజులుగా కూలీల వ్యక్తిగత ఖాతాల్లో జమవుతున్నాయన్నారు.

రెవెన్యూ సదస్సులు తాత్కాలికంగా వాయిదా

● అయినా అధికారులు సన్నద్ధంగా ఉండాలి: కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 13: భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16 నుంచి నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. అయినప్పటికీ సదస్సుల నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ నుంచి నోడల్ అధికారులు, తహసీల్దార్లు, వీఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సదస్సులు నిర్వహిస్తుందని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకూడదని, తప్పులు జరిగితే వీఆర్‌వోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. సదస్సులకు రోజువారీ షెడ్యూల్‌ను ముందుగానే సిద్ధం చేయాలన్నారు.

నవ్య చిత్రజ్యోతి
విజయనగరం • బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.

క్లుప్తంగా...

ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, విహారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా దూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగ చైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం అయనంక బోస్ విజువల్స్ మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

సవాలుతో కూడుకున్న విషయం



తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.

డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం "స్త్రీ 2'కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా.



టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.



ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/8tClgiXలో
చదవండి.

దిక్సూచి

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్


కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్ల స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org






గంట్యాడ: సిరిపురంలో ఎండిపోతున్న నాట్లు

ఖరీఫ్ కష్టమేనా?

- ఆదిలోనే నిరాశ
- అన్నదాతకు కలిసిరాని సీజన్
- ఎండుతున్న వరి నాట్లు
- కురవని వర్షాలు

గంట్యాడ, ఆగస్టు 13: వరిని నమ్ముకున్న రైతన్నలకు ఆది నుంచే కష్టాలు మొదలయ్యాయి. వరుణుడి జాడ లేక పంటపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. మొన్నటి వర్షాలకు వరి పంటపై గంపెడు ఆశలు పెట్టుకున్న రైతన్న మొహంలో అంతలోనే ఆవేదన కనిపిస్తోంది. 25 రోజులుగా కొన్ని ప్రాంతాల్లో చినుకు జాడ లేదు. గత నెల నుంచి కనీస స్థాయిలో వర్షం కురవకపోవడంతో ఇప్పటివరకూ వేసుకున్న నాట్లు ఎండిపోతున్నాయి. మరో వైపు నాట్లు పడని చోట వరి నారు మదురుతోంది. వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి జూన్ నెలలో పెద్దగా వర్షాలు కురవలేదు. జూలై నెలలో ఎక్కువ రోజులు వర్షాలు కురిసినా పంట సాగుకు అవసరమైన స్థాయిలో నీరు చేరలేదు. ప్రాజెక్టుల పరిధిలో మినహా వర్షాధార గ్రామాల్లో ఉన్న చెరువుల్లో కొద్దిపాటి నీరే చేరింది. ఆ వర్షాలకు కొన్నిచోట్ల రైతులు నాట్లు వేసుకున్నారు. నాట్లు వేసిన చోట ఎకరంకు సుమారు రూ.50 వేల వరకూ ఖర్చు అయ్యింది. మరికొన్ని చోట్ల నాట్లు వేసుకోవడానికి నీరు చాలకపోవడంతో నేటికీ అవి బీడుభూములుగా దర్శనమిస్తున్నాయి. నాట్లు వేసిన చోట ఎండిపోతున్న వరిని రక్షించుకోవడానికి చెరువుల్లో ఉన్న కాస్త నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 90,058 హెక్టార్లలో వరి విస్తీర్ణం కాగా ఇప్పటి వరకూ 43,312 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేసుకున్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. గత 25 రోజుల నుంచి వర్షాలు కురవకపోవడం.. ఎండలు తీవ్రంగా ఉండటంతో నాట్లు వేసిన పొలాల్లో భూములు నెర్రెలు ఇస్తున్నాయి. మరోవైపు వరి నారు వేసుకుని నెల రోజులు కావస్తున్నా నీరు లేక నాట్లు వేసుకోలేని దుస్థితిలో మరికొందరు ఉన్నారు.

మొదట్లోనే పంట ఎండిపోతోంది

చెరువుల్లో ఉన్న నీటిని తోడించి నాట్లు వేసుకున్నాం. ఊబాలు వేసేందుకు ఎకరం వద్ద సుమారు రూ.50 వేలు ఖర్చు పెట్టాం. గత 25 రోజులు నుంచి వర్షాలు లేక పంట ఎండిపోతోంది. నాట్లు వేసుకున్న పొలాల్లో నెర్రెలు కనిపిస్తున్నాయి. మొదట్లోనే పంట ఎండిపోతే రానున్న రోజుల్లో పంటకు నీరు ఉండటం చాలా కష్టం.

- బి.అప్పలనాయుడు, చంద్రంపేట రైతు

ఆందోళన చెందాల్సిన పనిలేదు

వర్షాలు ఒకటి రెండు రోజుల్లో కురిసే అవకాశాలు ఉన్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. నెలాఖరు వరకూ నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంది. అప్పటికీ వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

- టి.రామారావు, జేడీ, వ్యవసాయశాఖ

మహిళా పోలీసుల బాధ్యత కీలకం

రాజాం రూరల్: గ్రామస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు స్పష్టం చేశారు. దీంతో పాటు గ్రామస్థాయిలో అసాంఘిక శక్తులకు సంబంధించిన సమాచారం, వివాదాలకు ఆస్కారం కలిగించే వ్యక్తుల వివరాలతో పాటు కొత్తవ్యక్తుల కదలికల వివరాలను పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయడం వంటి బాధ్యతలున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పోలీసులతో టౌన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. నిర్దేశించిన కేంద్రాల్లో సమర్థంగా విధులు నిర్వహించాలని సూచించారు.

'సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం'

వేపాడ: రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఆగస్టు 15న బ్లాక్‌డేగా ప్రకటిస్తూ మండల కేంద్రం వేపాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబారిక కిరణ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రిజర్వేషన్ల వర్గీకరణపై రాజ్యాంగ విరుద్ధంగా తీర్పునివ్వడం దారుణమన్నారు. దళిత కూలీ రైతు సంఘ నాయకులు కొరుపోలు గంగరాజు, దేబార్కి రవి, కడారి అప్పారావు, పార్థిన సోమునాయుడు, చెలికాని బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

రేగిడి: సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో పాడైన బోర్లకు మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. సర్పంచ్ బి.పట్టాభి, పంచాయితీ కార్యదర్శి శైలజ పర్యవేక్షించారు. వీధి దీపాల సమస్యను తొలగించేందుకు మూడు గ్రామాల్లో ఎల్‌ఈడీ లైట్లు వేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఎంపీని కలిసిన టీడీపీ నాయకులు

వంగర: విజయనగం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును మండల టీడీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో చిరకాలంగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీటిని సీఎంకి వివరిస్తానని కలిశెట్టి తెలిపారు. బి.రాంబాబు, త్రినాథ, శ్రీను తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటాలి

రాజాం: పాఠశాలల ఆవరణల్లో విధిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఎంఈవో పి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి వారు అందజేసిన మొక్కలను ఇల్లంనాయుడు వలస పాఠశాల ఆవరణలో నాటారు. వీటి విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పాఠశాలలో దంత వైద్య పరీక్షలు

రాజాం రూరల్: పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన దంత వైద్యశిబిరంలో 128 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు బంకి లావణ్య, సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీపీ రమణమూర్తి, ఎంఈవో ప్రవీణ్ కుమార్, హెచ్.ఎం. మహేశ్వరరావు, ఉపాధ్యాయులు మధుసూదనరావు, శ్రీలక్ష్మి, కామేశ్వరమ్మ, శారద, శ్రీదేవి, తులసి, చీడి జగన్నాథం పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

బొబ్బిలి రూరల్: పారాది గ్రామంలో మంగళవారం ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో రోండో రోజు సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ పాలనలో భూములు అన్యాక్రాంతం

రాజాం: వైసీపీ పాలనలో సీఐడీ ఆధీనంలో ఉన్న భూములను దొడ్డిదారిలో మాజీ మంత్రి జోగి రమేష్ కొడుకు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి, తరువాత వాటిని అమ్ముకొని బీసీలకు అన్యాయం చేశారని విజయనగరం పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వంగా వెంకటరావు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడారు. బీసీలపై ఏమైనా దాడులు జరిగిన సందర్భాలు అంటూ ఉంటే అవి వైసీపీ హయాంలోనే జరిగాయన్నారు. బీసీ నాయకులు బొద్దూరు ఎంపీటీసీ వల్లూరు గణేష్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ బీసీ సాధికార కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షుడు ముగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నూతన కోర్సులు

విజయనగరం టౌన్: యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచి వారికి ఉపాధిని ఇచ్చే మెరుగైన కోర్సులను అందించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆశారమణి, కో-ఆర్డినేటర్ ఎస్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి యువతీ, యువకులు ఐటీఐ, ఇంటర్, బీటెక్, ఇతర ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండాలని వారు తెలిపారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మవరం విద్యార్థిని



శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కాత్యాయని రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, రెడ్డి కృష్ణ తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకు విజయనగరం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరగనున్న ఈ పోటీలో జిల్లా జట్టుకు ఈమె ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

ఇసుక విక్రయ కేంద్రం పరిశీలన

బొబ్బిలి: బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక విక్రయ కేంద్రంలో గందరగోళం నెలకొంటోంది. ఈ కేంద్రం ప్రారంభించి 20 రోజులు కావస్తున్నప్పటికీ ఇంతవరకు అక్కడ తూనిక యంత్రాన్ని, సీసీ కెమే రాలను అమర్చకపోవడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంచనాగా ఇసుకను కొలిచి అమ్ముతుండడం గమనార్హం. ఇక్కడ ఇసుక పంపిణీ విధానంలో వెల్లువెత్తుతున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహశీల్దారు ఎం.శ్రీను గ్రోత్‌సెంటరులో గల ఇసుక స్టాకుపాయింట్‌ను పరిశీలించారు. స్థానికేతరులు పెద్దసంఖ్యలో వాహనాలను ఇసుక కోసం తీసుకురావడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను వెంటనే తీసుకుని వెనక్కి వెళ్లిపోవాలని లేకుంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. 20 టన్నుల పరిమితి పక్కాగా అమలు కావడం లేదని, దీనిపై ఎటువంటి లెక్కలు లేవని పలు వాహనాల డ్రైవర్లు తహసీల్దారు ముందు ఆరోపించారు. స్థానిక ఇసుక పాయింట్ నుంచి ఇకనుంచి ఇసుకను తీసుకెళ్లే వినియోగదారులు కచ్చితంగా తమకు సంబంధించిన అన్ని రకాల నిర్మాణ ఆధారాలను చూపాలని ఆంక్షలు విధించారు. తొలుత నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన తరువాత జిల్లా ప్రజలకు ఇవ్వాలని సూచించామన్నారు. కలెక్టర్ నుంచి ప్రత్యేక అనుమతి తెచ్చుకున్న స్థానికేతరులకు ఇసుక ఇస్తామని తహసీల్దార్ శ్రీను తెలిపారు.


ఇసుక పాయింట్ దగ్గర హెచ్చరిస్తున్న తహసీల్దారు

అన్న క్యాంటీన్లకు విరాళాలు

విజయనగరం రూరల్, ఆగస్టు 13: ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్న అన్న క్యాంటీన్లకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు కలిసి రూ.5,48,253 రూపాయలు విలువగల చెక్కులను అంబేడ్కర్‌కు మంగళవారం అందజేశారు. ఈ విరాళాలకు సంబంధించి ఎవరెవరు ఎంత విరాళం ఇచ్చింది? ఆమె చెక్కు నెంబర్లతో సహా విడుదల చేశారు.


చెక్కును కలెక్టరు అంబేడ్కర్‌కి అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

రాజాం: స్థానిక రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి తమ ఆనందాన్ని పంచుకున్నారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్ల వ్యవస్థకు పూర్వవైభవం తెస్తామని ప్రకటన చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ అధ్యక్షుడు సామంతుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

ఫుట్‌పాత్‌ల కొట్టివేతకు నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం రూరల్, ఆగస్టు 13: పట్టణంలోని మాధవబజార్‌లో కాలువలను ఆక్రమించి వాటిపై చేపట్టిన నిర్మాణాలను కొట్టివేయాలని రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు నిర్ణయించారు. కాలువలపై నిర్మాణాలవల్ల వాటిని శుభ్రం చేసే అవకాశం పారిశుధ్య సిబ్బందికి లేకపోవడం, తద్వారా కాలువల్లో చెత్త పేరుకుపోయి దోమల సంతతి పెరగడం, వ్యాధులు ప్రబలడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ 'ఫుట్‌పాత్‌నూ వదల్లేదు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైన నేపథ్యంలో కమిషనర్ అప్పలనాయుడు పలుమార్లు మాధవబజార్‌లో పర్యటించారు. పరిస్థితిని సమీక్షించారు. షాపుల యజమానులతో పలుమార్లు సమావేశమయ్యారు. పరస్పర అంగీకారంతో ఓ నిర్ణయానికొచ్చారు. షాపుల్లోకి వెళ్లేందుకు వీలుగా స్థలాన్ని విడచిపెట్టి మిగిలిన అక్రమ నిర్మాణాలను కొట్టివేయాలన్న కమిషనర్ ప్రతిపాదనకు యజమానులు అంగీకరించారు. దీంతో కాల్వలపై ఆక్రమణలు కొట్టివేసేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమవుతోంది.

బాలికలు చట్టాలను వినియోగించుకోండి

రాజాం రూరల్: సమాజం లో బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి బయటపడాలని, చట్టాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవా సంఘ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురవాం కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను పాఠశాల ఎస్‌వో సావిత్రిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జయదేవ్, టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, రాము తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

కలెక్టరేట్: జిల్లాలోని ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని, రోజుకు 195 ఇళ్లకు తక్కువ కాకుండా ప్రగతి చూపించాలని కలెక్టర్ కోరారు. గృహ నిర్మాణంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఇంకా 11,191 ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదని, వీటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● జిల్లాలోని గిరిజన గ్రామాల్లో విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. బొబ్బిలి మండలం గోపాలనాయుడుపేట పంచాయితీ పరిధిలో సియోనువలస, చినఅక్కివలస, రామన్న దొరవలస, కృపావలస, దీవెన వలస గ్రామాల్లో 60 కుటుంబాలు, దత్తిరాజేరు మండలంలో 74 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని కలెక్టరు తెలిపారు. ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ● విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మరుగునీటి, తాగునీటి సమస్య, విద్యుత్ తదితర అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వందరోజుల ఏడాది ప్రణాళికలు తయారు చేసినప్పటికీ మున్సిపాల్టీ పరిధిలో అత్యవసరంగా చేపట్టవల్సిన కార్యక్రమాలు కొన్ని ఉంటాయని, వాటిని వెంటనే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో స్థానిక శాసనసభ్యులు అదితి గజపతిరాజుతో, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో మొత్తం డ్రైనేజీ వ్యవస్థను అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏ మేరకు మరమ్మతులు అవసరం ఉన్నదీ వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు. అక్టోబరు 2 లోగా నగరంలో ఎక్కడా డ్రైనేజీ సమస్య లేకుండా పరిష్కరించాలన్నారు. నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

రాజాం: మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌తో సమావేశం నిర్వహించిన అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయానికి చేరుకొని మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాలకు సంబంధించి పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగనివ్వకుండా సకాలంలో ఎరువులు, పురుగులు మందులు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులతో చర్చించారు. ● జిల్లా స్థాయి అధికారులు రాజాంలో ఉన్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. వివిధ మండలాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోండ్రు కోరారు. ప్రత్యేకంగా రాజాం పట్టణంలో ప్రధాన రహదారి పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

టీడీపీలో 50 కుటుంబాల చేరిక


పార్టీలో చేరిన వారితో కొల్ల అప్పలనాయుడు

సంతకవిటి: రామారాయిపురం, షాలిపేట, చింతలపేట గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు మంగళ వారం టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకుడు కొల్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో వీరంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో పైడి శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, ఎన్ని మొగ్గునాయుడు, దువ్వారపు త్రినాథరావు, శ్రీనివాసరావు, బంక సత్యన్నారాయణ, చింతాడ విష్ణుమూర్తి, సునీల్ కుమార్, యరపాటి రాజారావు, బూరవల్లి కన్నయ్య, అసిరయ్య, జ్యోతి, సూర శ్రీరాములు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను, వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

రేగిడి: పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో వరప్రసాదరావు ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. చిన్నకోడిశ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎం సీతారాం తదితరులు పాల్గొన్నారు.


చిన్నకోడిశ పాఠశాలలో క్రీడా పోటీలు పరిశీలిస్తున్న ఎంఈవో

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

వంగర: వీవీఆర్‌పేట, రాజులగుమ్మడలలో తిష్టవేసిన ఏనుగులు అనేక పంటలను నేలమట్టం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ శాఖ అధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేయకుండా.. కాపలా కాస్తున్నారని, దీని వల్ల భారీగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని మంగళవారం కలెక్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే కోండ్రు కలిసి వివరించినట్లు తెలిపారు.


పంటలు ధ్వంసమైన దృశ్యం

బొల్లినేని విద్యార్థుల ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఈ ఫలితాల్లో ఆప్టోమెట్రీ విభాగంలో వి.చిన్మయి, ఇమేజింగ్ టెక్నాలజీ విభాగంలో పి.లీలా మాధవి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారన్నారు. అనస్తీషియా విభాగంలో పి.గీతిక రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, పెర్ఫ్యూజన్ విభాగంలో ఎం.శ్రావ్యశ్రీ 5వ ర్యాంకు, డయాలసిస్ విభాగంలో వై.సుష్మ భానోజీ 5వ ర్యాంకు సాధించారన్నారు. అత్యుత్తమ బోధన, నిరంతర పర్యవేక్షణతో ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. ఏటా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పద్మజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ

● యువకుడి మృతి.. మరొకరి పరిస్థితి విషమం


కరుణ (ఫైల్)

గరివిడి, ఆగస్టు 13: గరివిడిలో ఫేకర్ పరిశ్రమ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీఎఫ్ఎస్ కాలనీకి చెందిన కోండ్రు కరుణ(26) మృతి చెందాడు. మరో యువకుడు కింతాడ రేవంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి గరివిడి ఎస్ఐ దామోదరరావు, స్థానికులు అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. డీఎఫ్ఎస్ కాలనీకి చెందిన కరుణ గరివిడిలో సెల్‌పాయింట్ నడుపుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మిత్రులైన రేవంత్, నూకరాజుతో కలిసి బైక్‌పై డీఎఫ్ఎస్ కాలనీ నుంచి గరివిడి వస్తున్నాడు. ఈ క్రమంలో ఫేకర్ పరిశ్రమ వద్దకు వచ్చేసరికి గరివిడి నుంచి డీఎఫ్ఎస్ కాలనీ వైపు వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కరుణ అక్కడికక్కడే మృతి చెందాడు. రేవంత్ తీవ్రంగా గాయపడగా, మరో యువకుడైన నాగరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తల్లితండ్రులు నాగేశ్వరరావు, అప్పాయమ్మ గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా కరుణ రెండో వాడు. కుమారుడి మృతితో తల్లితండ్రులు విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గరివిడి ఎస్ఐ దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

విజయనగరం క్రైం, ఆగస్టు 13: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో ఈ నెల 8న అర్ధరాత్రి సమయంలో పెందుర్తికి చెందిన భార్యభర్తలపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. పెందుర్తి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌లో దిగి, వేరే ట్రైన్ లేనందున రైల్వే స్టేషన్ బయటకు వచ్చి టీ తాగి, వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తూ, అడ్డువచ్చిన భర్తని దారుణంగా కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై బాధితులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు దాడికి పాల్పడిన కోరాడ దండు (ఆలియాస్ దండు రాజు), బొగ్గు సూరి(అలియాస్ సూర్య)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యాయత్నానికి ఉపయోగించిన కర్రను, చాకును సీజ్ చేసినట్టు తెలిపారు.


అదుపులోకి తీసుకున్న వారితో సీఐ శ్రీనివాస్

మహిళ హత్య కేసులో భర్తకు రిమాండ్

శృంగవరపుకోట రూరల్, ఆగస్టు 13: భార్యమృతికి కారణమైన వ్యక్తిని శృంగవరపుకోట పోలీస్‌లు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి సీఐ వీఎస్‌మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మూలబొడ్డవర పంచాయతీ అమ్మపాలెం గ్రామానికి చెందిన దేవరపు దేముడుతో రమణమ్మకు కొంతకాలం క్రితం వివాహమైంది. వీరికి 12 సంవత్సరాల బాబు, 10 సంవత్సరాల పాప ఉంది. భార్యపై అనుమానంతో, దంపతుల మధ్య మనస్పర్థలు పెరిగి తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి 8గంటల సమయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. కోపంతో రమణ చెక్కబద్దతో భార్య తలపై బలంగా కొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమణమ్మ(35) స్పృహ కోల్పోయింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12న రాత్రి మృతి చెందింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వీఎస్‌మూర్తి కేసు నమోదు చేశారు. నిందుతుడిని కోర్టుకు తరలించారు.


పోలీసుల అదుపులో నిందితుడు దేముడు

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టండి

రాజాం రూరల్, ఆగస్టు 13: నేరాల నియంత్రణపై పోలీసులు దృష్టి పెట్టాలని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి స్పష్టం చేశారు. ఇక్కడి రూరల్ సర్కిల్ కార్యాలయంలో రాజాం రూరల్, సంతకవిటి, రేగిడి ఎస్.ఐ.లతో రూరల్ సీఐ ఉపేంద్రతో కలిసి మంగళవారం ఆయన సమావేశమయ్యారు. శాంతిబద్రతల పరిరక్షణ, కేసులు, చార్జిషీట్లు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఎస్.ఐ.లకు దిశ, నిర్దేశం చేశారు.


రూరల్ సర్కిల్ ఎస్ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ

షట్టర్లు పోతున్నా పట్టించుకోరా?



- చోరీకి గురవుతున్న సాగునీటి కాలువ షట్లర్లు
- కానరాని మరమ్మతులు.. శిథిలావస్థకు గురవుతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

గజపతినగరం: మండలంలోని 13 గ్రామాలకు సాగునీటిని అందించే 13వం తుల కాలువకు సంబంధించి షెట్టర్లు చోరీకి గురవుతున్నాయి. సాగునీటి కాలువను పాలకులు, అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇనుప షెట్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోతు న్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ కాలువ ద్వారా సుమారు 2వేల హెక్టార్లకు సాగునీరు అందుతుంది. అయితే కాలువలు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని డోలపాలెం వద్ద కాలువకు సంబంధించి నీరును విడిచిపెట్టేందుకు షెట్టర్లను గతంలో అధికారులు ఏర్పాటు చేశారు. అయితే నేటికి వాటిపై అధికారులు శ్రద్ధ వహించకపోవడంతో చోరీలకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సాగునీటి సంఘాలు ఉండేవని కాలువల ఆధునికీకరణ పనులతో పాటు సాగునీటిపై దృష్టి సారించేవారని సుమారు 8ఏళ్లగా సాగునీటి సంఘాల ఎన్నికలు జరగకపోవడంతో కాలువలను పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

డోలపాలెం కాలువ వద్ద చోరీకి గురైన ఇనుప షట్టర్లు

సమరయోధులను స్మరించుకుందాం

గజపతినగరం: స్వాతంత్య్ర సమరయోధులను గుర్తు చేసుకోవల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం గజపతినగరంలో 500 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ వర్మ, పార్లమెంట్ కన్వీనర్ సంబరలక్ష్మి నరసింహం, జిల్లా కార్యదర్శి మండపాక భారతి, పార్టీ మండల అధ్యక్షుడు ఎడుకొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన జాతీయ జెండాలు

విజయనగరం, దాసన్నపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విక్రయాల కోసం జాతీయ జెండాలు జిల్లాకు చేరాయని జిల్లా పోస్టల్ సహాయ సూపరింటెండెంట్ కింతాడ మధు తెలిపారు. మంగళవారం పోస్టల్ కార్యాలయంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి జాతీయ జెండాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, సీతారాం, బూర జగ్గారావు తదితరులు ఉన్నారు. ● **శృంగవరపుకోట:** ఎస్.కోట తపాలా కార్యాలయంలో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని బీజేపీ నాయకుడు, స్థానిక శక్తి-కేంద్ర ప్రముఖ డి.సూర్యారావు తెలిపారు. పోస్టుమాస్టర్ హర్షకు రూ.25 చెల్లించి వీటిని పొందవచ్చన్నారు.

ఉచితంగా పంపిణీ

బొబ్బిలి రూరల్: అలజంగి గ్రామంలో ఓ పాఠశాల హెచ్ఎం కృష్ణదాస్ మంగళవారం జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న ప్రతి ఇంటి పైన మువ్వన్నెల పతాకం ఎగురవేయాలనే సంకల్పంతో జాతీయ జెండాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: 500 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

స్వాతంత్ర్య వేడుకలకు విరాళం

బొబ్బిలి రూరల్: రంగరాయపురం పాఠశాలకు మంగళవారం పూర్వ విద్యార్థి పోతాబత్తుల సూర్యారావు రూ.2వేలు విరాళంగా ఇచ్చారు. స్వాతంత్ర్య వేడుకల కోసం ఆ మొత్తాన్ని హెచ్ఎం పి.నాగరాజుకు అందించారు.



విజయనగరంలో జెండాలు కొనుగోలు చేస్తున్న శివప్రసాద్‌రెడ్డి



ఎస్.కోట పోస్టాఫీస్ అధికారికి జెండాలను అందిస్తున్న సూర్యారావు



బొబ్బిలి రూరల్: జెండాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పలు చోట్ల యథేచ్ఛగా సాగుతున్న ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టాలని ఏడో వార్డు కౌన్సిలర్ షైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రసాద్ విలేకర్లతో మాట్లాడారు. శ్రీరామ్‌నగర్ కాలనీ అలబానీ వీధిల్లో సర్వే నెం.312లో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఆయన వివరించారు. అలాగే రాస్తాపై పూరి పాక వేసి పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. సర్వే నెం.90లో మెట్ల ప్రాంతంలో పలువురు నకిలీ పట్టాలు సృష్టించి అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, అలాగే సర్వే నెం.66లో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో సుమారు 8 మంది ఇళ్లు, దుకాణాలు అక్రమంగా నిర్మించారని వివరించారు. ● **మెంటాడ:** మండలంలోని ఉద్దంగి రెవెన్యూ పరిధి సర్వే నెం.103లో తాము సాగుచేసుకుంటున్న రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ భూస్వామి దౌర్జన్యంగా ఆక్రమించారని ఉద్దంగి ఉప సర్పంచ్ పాచిపెంట సత్యనారాయణ, స్థానిక రైతులు ముగుడ గౌరమ్మ, వెంకటరమణ తదితరులు సోమవారం కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్, ఆంధ్ర పోలీసులకు కూడా ఫిర్యాదు అందజేశారు. సదరు భూస్వామి ఇప్పటికే తన భూమికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములతోపాటు, కాలువలు, చెరువులను, కొందరి డీపట్టా భూములను ఆక్రమించారని ఆరోపించారు. తమ భూముల ఆక్రమణపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని వివరించారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.





మెంటాడ: డీటీకి ఫిర్యాదు కాపీ అందజేస్తున్న రైతులు, నెల్లిమర్ల: కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

ఎయిర్‌పోర్టు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం: మండలంలో ఎయిర్‌పోర్టు బాధితుల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన కవులవాడకు చెందిన టీడీపీ నాయకుడు తాతారావుతో కలిసి మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిమిత్తం కొంతమందికి గృహాలు మంజూరు చేయగా, మరి కొంతమందికి మంజూరు చేయలేదని తెలిపారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేశారని చెప్పారు. వీటిపై దర్యాప్తు చేసి అర్హులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేసేటట్లు చర్యలు తీసుకోవాని ఆయన కోరారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ దీనిపై పరిశీలించి అర్హులుంటే పైఅధికారులకు తెలియజేస్తామని తెలిపారు.



తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

గుర్ల: చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ డిపో డీలర్లకు గౌరవం పెరిగిందని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పిల్ల అప్పల నాయుడు అన్నారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కె.భీమారావు, కార్యదర్శి భాస్కరరావు, డీలర్ల సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

కెంబూరి కుటుంబానికి అరుణ పరామర్శ

చీపురుపల్లి: దివంగత మాజీ ఎంపీ కెంబూరి కుటుంబాన్ని జనసేన నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ మంగళవారం పరామర్శించారు. చీపురుపల్లిలోని కెంబూరి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట జనసేన నాయకులు పడాల శరత్‌చంద్ర, కోట్ల కృష్ణ, సాసుబిల్లి రామునాయుడు ఉన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విజయనగరం రూరల్: యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని జేఎన్‌టీయూ వీసీ డి.రాజ్యలక్ష్మి అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డ్రగ్స్ నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీకుమార్‌తో పాటు డైరక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

గంట్యాడ: గంట్యాడలో నిర్వహిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా కార్యక్రమాన్ని డీపీవో శ్రీధర్ రాజా మంగళవారం పరిశీలించారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో అమలు చేయాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలను దూరం చేయవచ్చని తెలిపారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ తదితరులు ఉన్నారు.

కూల్చేసి.. వదిలేస్తారా?



మెంటాడ: మెంటాడ గ్రామంలో హైవే రోడ్డు పనుల్లో భాగంగా హైస్కూలు భవనాల కూల్చివేతపై కలెక్టర్ అంబేడ్కర్ ఆరా తీశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఈవో ప్రేమ్‌కుమార్‌ను మంగళవారం ఆదేశించారు. ఏడాది కిందట హైవే అథారిటీవారు ఇక్కడ హైస్కూల్ భవనాలను కూల్చివేసి, సుమారు రూ.కోటి 37లక్షల నిధులను విడుదల చేశారు. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీనిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'కూల్చేసి.. వదిలేసి' శీర్షికతో కథనం ప్రచురితమ య్యింది. దీనిపై కలెక్టర్ స్పందించి డీఈవోకు ఆదేశాలు జారీచేశారు. దీంతో డీఈవో.. డిప్యూటీ డీఈవో కె.మోహనరావుతో చర్చించారు. వెంటనే పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఈవో.. స్థానిక ఎంఈవో-2 యూవీఎస్‌పీ వర్మను దీనిపై వివరణ కోరగా, ఆయన హైస్కూల్ హెచ్ఎం అరుణకుమారి నుంచి నివేదిక కోరారు. కొత్త భవనాలు నిర్మించక విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆమె నివేదికలో పేర్కొన్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు భవనాల నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పి తర్వాత ఎన్నికల కోడ్ పేరు చెప్పి ఆపేశారని తెలిపారు. ఇటీవల జడ్పీ చైర్మన్ కలిసి విషయం చెప్పగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారన్నారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయించాలని హెచ్ఎం నివేదికలో విజ్ఞప్తి చేశారు. ఈ నివేదికను డీఈవోకు అందజేస్తామని ఎంఈవో-2 వర్మ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జికి అనుమతులు మంజూరు చేయండి

గజపతినగరం: గజపతినగరం రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా సభ్యుడు జి.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరం నుంచి మెంటాడ వరకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, గేటుపడితే గంటల కొద్దీ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో 108 వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు ఎంపీ ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్దరాజు రాంబాబు, రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కలిశెట్టికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా..

దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్

విజయనగరం రింగురోడ్డు: నగరంలో దోమల నియంత్రణకు డ్రోన్‌ల సహాయంతో ప్రయోగాత్మకంగా చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్ విజయవంతం అయ్యిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. మంగళవారం అయ్యన్నకోనేరు ప్రాంతంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోనేరు చుట్టూ తిరిగి టీటీఐ ఆయిల్ పిచికారీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా.సాంబమూర్తి, ప్రజారోగ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గుర్ల: ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటాలని బుల్లితెర నటుడు మోహన్ అన్నారు. స్వతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదబంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాస్ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోహన్‌తో పాటు ఏఎస్ఐ కామేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్వాస్ సేవా సంఘం అధ్యక్షుడు బూర్లె పైడిపినాయుడు, కార్యదర్శి పి.కమలనాయుడు, ఎన్వీఎస్ బ్లడ్ బ్యాంకు నాగేశ్వరరావు, హెచ్ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న బుల్లితెర నటుడు మోహన్

సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే నాగమాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్తూ అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా పనిచేయాలని ఆమె సూచించారు. మండలంలోని సతివాడ, రామతీర్థం పశువైద్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉండడంలేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎంపీడీవో జి.రామారావు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఈవోపీఆర్డీవో కె.సింహాద్రి, పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గుర్ల: సీజనల్ వ్యాధులపై క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ జరగాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సిబ్బందికి సూచించారు. తెట్టంగి పీహెచ్‌సీని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతం కావడం వల్ల ఇక్కడకు రోగులు వచ్చేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. రోగులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రసవ గది, మందుల నిల్వ, లేబరేటరీలో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జ్వరపీడుతులకు రక్తపూతల సేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి కె.స్వప్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎం.గోపి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూట్ పరిశ్రమను ఆదుకోవాలి

- కేంద్ర మంత్రికి జూట్ అసోసియేషన్ విజ్ఞప్తి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాగార్జున తదితరులు

చీపురుపల్లి: రాష్ట్రంలో జూట్ పరిశ్రమలను ఆదుకోవాలని రాష్ట్ర జూట్ పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కిమిడి నాగార్జున నేతృత్వంలోని యూనియన్ ప్రతినిధులు టీవీఎస్ లింగమూర్తి, సునీల్, హర్ష నహత తదితరులు మంగళవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో జూట్ పరిశ్రమ తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. దీనికారణంగా లక్షలాది మంది ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ పరిశ్రమల్ని ఆదుకోవాలని వారు కోరారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి ఉత్తరాంధ్రలో జూట్ పరిశ్రమల బాగు కోసం తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ విషయంలో సంబంధిత మంత్రితో మాట్లాడి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

గజపతినగరం: పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు వచ్చేవిధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని న్యాయాధికారి బి.కనకలక్ష్మి అన్నారు. మరుపల్లి గ్రామంలోగల కేజీబీవీని ఆమె మంగళవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతులను పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు వైద్యం, ఆరోగ్యం పట్ల ఎటువంటి చర్యలు తీసుకుంటున్నది అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు చట్టాలు, న్యాయంపై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ హైమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురండి



చీపురుపల్లిలో ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న సహాయ కమిషనర్ కృష్ణమోహన్

గజపతినగరం: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ)ను వినియోగంలోకి తీసుకువచ్చి ఎరువులను తయారు చేసి పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రాల శిక్షణా అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక చెత్త సంపద కేంద్రంలో సర్పంచ్‌ల రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెత్తసంపదకేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడిచెత్తలను ప్రతి ఇంటి నుంచి సేకరించి ఎరువులను తయారు చేసే విధానంపై అవగాహన కల్పించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయింతిప్రసాద్, ఏవో సుదర్శనం, పర్యవేక్షణాధికారి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** చీపురుపల్లిలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ సహాయ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ మంగళవారం పరిశీలించా రు. ఇక్కడ సర్పంచ్‌ల శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన అనంతరం ఆయన పట్టణం లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. అక్కడ షెడ్ నిర్వహణ తదితర పనుల్ని పరిశీలించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవి, చీపురుపల్లి శానిటరీ తనిఖీ అధికారి జి.వేణుగోపాల్, మండల పరిషత్ పాలనాధికారి ప్రవీణ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల పరిశీలన



భోగాపురం: భోగాపురం గ్రామంలో విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులపై ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం రాత్రి విద్యుత్తుశాఖ ఏఈ మస్తాన్‌వలి, అసిస్టెంట్ ఏఈ శ్రీనివాసరావు, లైన్‌మన్ వెంకటరావు.. భోగాపురంలోని విద్యుత్తు మీటర్లు పరిశీలించారు. మీటర్లలో విద్యుత్తు ఎంత సరఫరా అవుతుంది, ఎంత సరఫరా కావల్సి ఉందని పరిశీలించారు. అలాగే విద్యుత్తు జంపర్లు తదితర వాటిని పరిశీలించారు. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారణాలు లేకుండా తిరిగితే కేసులు

విజయనగరం క్రైం: నగరాలు, పట్టణాల్లో కారణాలు లేకుండా అర్ధరాత్రులు తిరిగితే, కేసులు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్ధరాత్రి కారణాలు లేకుండా తిరుగుతున్న గత మూడు రోజులుగా 121 మందిపై కేసులు నమోదు చేసి, కౌన్సిలింగు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో భాగంగా రాత్రి గస్తీ, పెట్రోలింగులో మౌలిక మార్పులు చేశామన్నారు. రాత్రి 11 గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ సెంటర్లు మూసే విధంగా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెట్రోలింగు తిరిగే వాహనాలను బీట్ పర్యవేక్షణ అధికారులను, నిరంతరం రాత్రులు అప్రమత్తం చేయాలని కంట్రోల్ రూం సిబ్బందిని ఆదేశించారు.

హుండీ చోరీ

నెల్లిమర్ల: జరజాపుపేటలోని రాజబంగారమ్మతల్లి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆలయం తెరిచే సమయంలో హుండీ పగలగొట్టి ఉండడాన్ని ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు గుర్తించారు. హుండీలో సుమారు రూ.20వేలు ఉండి ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయనగరం నుంచి క్లూస్‌టీం వచ్చి ఆధారాలను సేకరించింది. ఆలయం ఎదురుగా ఉన్న మిలాన్ స్కూల్ సీసీ ఫుటేజీలను పరిశీలించగా సోమవారం రాత్రి 1.30 గంటల సమయంలో ఓ వ్యక్తి ఆలయ పరిసరాల్లో సంచరించినట్టు ప్రాథమిక ఆధారాలు లభించాయి.